# కాశ్మీరు సమస్య - కొన్ని వాస్తవాలు

మొన్నటి పార్లమెంటు ఎన్నికలు జరిగిన తరువాత కొద్ది రోజులకే కాశ్మీరుకు చెందిన జె.కె.ఎల్.ఎఫ్ (జమ్మూ కాశ్మీరు విముక్తి సంఘటన) కార్యకర్తలు దేశ హోంమంత్రి శ్రీ ముఫ్తీ మహమ్మద్ సయీద్ కుమార్తె అయిన డా. రుబియాను కిడ్నాప్ చేసి జైల్లో బందీలుగా ఉన్న తమ కార్యకర్తలను విడిపించుకున్నారు. అప్పటినుండీ 'కాశ్మీరు సమస్య' అనేది దేశంలో విస్తృతంగా చర్చకు వచ్చింది. కాశ్మీరు గురించి వార్తలు ప్రతిదినం పత్రికలలో వస్తూ వున్నాయి. సంపాదకులు వ్యాఖ్యలు రాస్తున్నారు. మేధావులు వ్యాసాలు రాస్తున్నారు. అయినా అసలు విషయం ఏమిటో ఎవ్వరూ స్పష్టం చేయడం లేదు. 'దేశభద్రత' 'దేశ సమైక్యత' 'దేశ సమగ్రత' అనే వాటిని ఎట్లాగయినా సంరక్షించాలనీ విచ్ఛిన్న కారులకు ప్రభుత్వం ఎంతమాత్రం లొంగకూడదనీ పాకిస్తాన్ యుద్ధానికి వస్తే జాతి యావత్తూ ఒకటిగా నిలబడి ఎదుర్కొనాలనీ అందరూ పదే పదే విజ్ఞప్తులు చేస్తున్నారు గానీ అసలు ఇంతగా గాభరా పడవలసిన పరిస్థితి ఎందుకు ఉత్పన్నం అయిందో ఎవరూ వివరిస్తున్నట్టు కనిపించదు.

ఏ విషయాన్నయినా ప్రభుత్వం దృష్టితో కాకుండ ప్రజల దృష్టితో చూడడం ముఖ్యం. ప్రజాస్వామిక దృక్పథానికి ఇది కీలకమయిన విషయం. అసలు 'కాశ్మీరు సమస్య' అనే మాటలు వాడడంలోనే అప్రజాస్వామిక ధోరణి వుంది. అది ఎవరికి సమస్య? కాశ్మీర్ ప్రజలకా, భారత ప్రభుత్వానికా? కాశ్మీరు ప్రజలకయితే అది హోంమంత్రి కుమార్తె కిడ్నాప్‌తో ప్రారంభం కాలేదే, 1947 నుండీ వుందే. మరి ఇన్నాళ్ళూ దానిని గురించి ఇంత పెద్ద ఎత్తున ఎందుకు చర్చ జరగలేదు? ఇన్నాళ్ళు 'కాశ్మీర్ సమస్య' అనేది భారత-పాకిస్తాన్ ప్రభుత్వాల మధ్య సమస్య గానూ ఇవ్వాళ మనందరి సమస్యగానూ ఎందుకు చూపిస్తున్నారు?

'భారతదేశం' అని ఇవ్వాళ మనం పిలుచుకునే దేశం చరిత్రలో అనాదిగా వున్నది కాదు. ఒక సామాజిక వ్యవస్థ, ఒక సంస్కృతి, చాలా కాలంగా ఈ భూభాగంలో నెలకొన్ని వున్నాయి. కుల వ్యవస్థ, బ్రాహ్మణ మతం, సంస్కృతం భాష, ఢిల్లీ సుల్తాన్ల తరువాతి కాలంలో ఒక రెవెన్యూ విధానం, ఒక పరిపాలనా యంత్రాంగం, ఇవీ ఆసామాజిక వ్యవస్థ ప్రముఖ లక్షణాలు. ఈ వ్యవస్థలో విభిన్న భాషలూ, ఆచారాలు, మతాలు సంస్కృతీ వున్న ప్రజలు నివసిస్తున్నారు. 'దేశ సమగ్రత' గురించి బాధపడే ముందు వీళ్ళంతా ఒక 'దేశం' ఎప్పుడయ్యారు, ఎట్లాగయ్యారు అని కొంచెం ఆలోచించాలి. అసలు వీళ్లంతా ఒక 'దేశం' అయ్యారా అన్న అనుమానం వస్తే దానిని తొక్కిపెట్టకుండా చర్చించాలి. ఆర్టికల్ 370ని రద్దు చేయాలి అని గొడవ చేసే వాళ్ళు అసలు ఆర్టికల్ 370 రాజ్యాంగంలోకి ఎందుకొచ్చింది అని కొంచెం ఆలోచించాలి.

ఈ 'ఉపఖండం' అంతటా ఒకే రాజ్యం చరిత్రలో ఎన్నడూ లేదు. అశోకుడి నుండీ ఔరంగజేబ్ దాకా ఇందులో కొంత భాగాన్నే తప్ప ఎవరూ అంతటినీ పరిపాలించ లేదు. బ్రిటిష్ వాళ్లు మొత్తం అంతటికీ తాము సార్వభౌములమని ప్రకటించుకున్నారు గానీ వాళ్లు ప్రత్యక్షంగా పరిపాలించిన ప్రాంతం ('బ్రిటిష్ పాలిత ప్రాంతం') సగ భాగం మాత్రమే. మిగిలిన సగం భూభాగాన్ని బ్రిటిష్ వారికి సామంతులయిన రాజులు, నవాబులు, జాగీర్దార్లు, సంస్థానాధీశులు పరిపాలించారు. బ్రిటిష్ వాళ్ళు వెళ్ళిపోగానే తాము తిరిగి స్వతంత్రులం కావాలని వీళ్ళు కోరుకున్నారే తప్ప అందరూ ఒకే ఒక 'భారతదేశం'లో కలిసి పోవాలని కోరుకోలేదు. బ్రిటిష్ ప్రభుత్వంతో చర్చలు జరిగినప్పుడల్లా వాళ్లు ఈ విషయాన్ని నొక్కి చెప్పారు.

ఉపఖండంలోని ప్రజలంతా ఒకటయి ఇటు స్థానిక రాజవంశాల పాలనకూ అటు బ్రిటిష్ పాలనకూ వ్యతిరేకంగా పోరాటం చేసి విముక్తి పొంది వుంటే ఒక 'భారతదేశం' అనేది సహజంగా ఏర్పడి వుండేదేమో గానీ అటువంటిదేమీ జరగలేదు. గిరిజనులూ రైతాంగమూ కార్మికులూ చేసిన అనేక పోరాటాలు, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలు, విడివిడిగా అనైక్యంగా ఉండిపోయాయి. ఐక్యత సాధించినది బ్రిటిష్ పాలిత ప్రాంతాలలోని సంపన్న వర్గాలు మట్టుకే. వాళ్లంతా ఒకటయి కాంగ్రెసు నాయకత్వంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా బేరసారాల, రాజీ సర్దుబాట్ల, పోరాటం, నడిపారు. స్థానిక రాజ్యాలలోనూ సంస్థానాలలోనూ ఎటువంటి పోరాటాలూ జరగకుండ కాంగ్రెస్ జాగ్రత్త పడింది. ఆ విషయం గాంధీ సగర్వంగా ప్రకటించుకున్నాడు కూడా. బ్రిటిష్ పాలిత ప్రాంతములోని సంపన్నులు 'బ్రిటిష్ సామ్రాజ్యం అనే కుటుంబములో మాకు కూడా ఒక గౌరవనీయమయిన స్థానం కావాలని' (ఇవి గాంధీగారి మాటలు) జరిపిన ఉద్యమం కాంగ్రెస్ వారి జాతీయ పోరాటం.

ఈ ఉద్యమం ఫలించే నాటికి స్థానిక రాజ్యాలనూ సంస్థానాలనూ ఏం చేయాలనే సమస్య వచ్చింది. బ్రిటిష్ వాళ్లు వెళ్ళిపోగానే వాళ్లతోబాటు వాళ్ల సార్వభౌమత్వం కూడ పోవాలనీ ఆ సార్వభౌమత్వం కొత్త భారత ప్రభుత్వానికి సంక్రమించడానికి వీలు లేదనీ తాము స్వతంత్రులం కావాలనీ స్థానిక రాజులూ, సంస్థానాధీశులూ మొదటి నుంచీ వాదిస్తూ వచ్చారు. బ్రిటిషువాళ్ళు కూడ, స్థానిక రాజ్యాలు

పూర్తిగా స్వతంత్రంగా ఉండకున్నా, తాము కోరుకున్నా స్వయం ప్రతిపత్తిని కలిగి వుండాలని భావించారు. సైమన్ కమీషన్ (1927), భారత ప్రభుత్వ చట్టం (1935), క్రిప్స్ రాయబారం (1942), కేబినెట్ రాయబారం (1947), అన్నీకూడ కుడి ఎడమలుగా ఈ అభిప్రాయాన్నే వెలిబుచ్చాయి. కాంగ్రెసు నాయకులు అన్ని విషయాల లాగ ఈ విషయంలో కూడ బయటికి ఈ స్వయంప్రతిపత్తి వాదాన్ని వ్యతిరేకిస్తూ లోపాయకారీగా దానితో రాజీ పడుతూ వచ్చారు. అధికార మార్పిడి జరిగి నూతన రాజ్యాంగాన్ని రాయడానికి సమాయత్తమైన భారత రాజ్యాంగ సభ బ్రిటిష్ కమీషన్ల సంప్రదాయాన్ని ఆమోదించింది. ప్రతి స్థానిక సంస్థానానికీ ఇటు భారతదేశంలో గానీ, అటు పాకిస్తాన్‌లో గానీ విలీనం అయ్యే హక్కు వుంటుందనీ, ఆ విలీనానికి ప్రాతిపదికగా ఒక విలీన ఒడంబడిక (Instruments of accession) మీద ఇరు పక్షాలూ సంతకం చేయాలనీ, విలీనమయ్యే సంస్థానం కొత్త కేంద్ర ప్రభుత్వానికి ఆ ఒడంబడికలో ఏ అధికారాలనయితే దత్తం చేస్తుందో (ప్రధానంగా రక్షణ, విదేశ వ్యవహారాలు, రవాణా సౌకర్యాలు) అవి తప్ప తక్కిన అన్ని విషయాలలోనూ స్వయం ప్రతిపత్తిని కలిగి వుంటుందనీ భారత రాజ్యాంగ కర్తలు ఒప్పుకున్నారు. ఇది వారు స్వచ్ఛందంగా అంగీకరించిన విషయమే తప్ప ఎవరూ కుట్ర పూరితంగా సాధించుకున్నది కాదు. ఎవరో దేశద్రోహుల చర్యకాదు.

చిన్న చిన్న రాజ్యాలూ సంస్థానాలు తమకు ఏ స్వయం ప్రతిపత్తి వద్దని పూర్తిగా విలీనం అయిపోయాయి. పెద్ద రాజ్యాలయిన మైసూరు, భోపాల్, జమ్మూ-కాశ్మీర్, హైదరాబాద్ కొంత తటపటాయించాయిగానీ వల్లభాయి పటేల్ వాటిని నయానా భయానా ఒప్పించి సంపూర్ణ విలీనాన్ని సాధించాలని ప్రయత్నించి జమ్మూ-కాశ్మీర్ తప్ప తక్కిన అన్ని సంస్థానాలనూ విలీనం చేసాడు. ఇక బ్రిటిష్ పాలిత ప్రాంతాలలోని ప్రజలకయితే భారత దేశంలో చేరడం చేరకపోవడం అనే స్వేచ్ఛే లేదు. చేరడానికి పెద్దగా అభ్యంతరం లేని ప్రాంతాలే కాక ఎంత మాత్రం ఇష్టంలేని నాగాలాండ్, మిజోరం, మణిపూర్‌లు కూడ బలవంతంగా భారతదేశంలో భాగమయ్యాయి. మన దేశ సమగ్రత సమైక్యతల చరిత్ర ఇది.

జమ్మూ-కాశ్మీర్ మట్టుకు ఇటు భారతదేశంలో గానీ అటు పాకిస్తాన్‌లో గానీ చేరడానికి ఇష్టపడలేదు. నైసర్గికంగా ఆ రాష్ట్రం స్వతంత్రంగా ఉండగలదు. ప్రత్యేకమయిన జాతి, భాష, సంస్కృతి ఉన్నాయి. కాశ్మీర్ జాతీయ భావం చాలా లోతయినది. భారత పాకిస్తాన్ దేశాలు ఆ జాతీయ భావాన్ని గౌరవించి వుంటే జమ్మూ-కాశ్మీర్ స్వతంత్రంగా ఉండేదేమో. అయితే ఈ దేశాల పాలకులలో అంతటి ప్రజాతంత్ర స్వభావం ఏరోజూ లేదు. ఎవరికి వారు కాశ్మీర్‌ను ఎట్లా కలుపుకోవాలి అని చూసారు. జమ్మూ-కాశ్మీర్‌లో అత్యధికులు ముస్లింలు కాబట్టి మాకే చెందాలని పాకిస్తాన్ అంటే, పరిపాలకుడయిన హరిసింగ్ హిందువు కాబట్టి భారతదేశంలో చేరక పోతాడా అని మనవాళ్ళు ఆశపెట్టుకున్నారు. పాకిస్తాన్ వాదనలతో



జనవరి 22న పోలీసు చర్యకు నిరసనగా శ్రీనగర్‌లోని భోటా బజార్‌లో
జనవరి 22న పోలీసు చర్యకు నిరసన తెలుపుతున్న ప్రజ

సరిపెట్టుకోక 1947 అక్టోబర్ 26వ తేదీన దుండగుల ముఠాలను కాశ్మీర్ మీదికి పంపించింది. కాశ్మీర్ రాజు గాభరాపడి భారత ప్రభుత్వం అండ కోరాడు. ఈదేశంలో విలీనం అయితే సైనిక సహాయం దొరుకుతుందని విలీన ఒడంబడిక మీద సంతకం చేసి జమ్మూ-కాశ్మీర్‌ను భారతదేశంలో కలిపాడు. అయితే విలీన ఒడంబడిక ప్రకారం రక్షణ, విదేశ వ్యవహారాలు, రవాణా ప్రసార సాధనాలు తప్ప తక్కిన విషయాలలో జమ్మూ-కాశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి ఉంటుంది. ఇది ఇరుపక్షాలూ ఒప్పుకున్న ఒడంబడికే?

రాజ్యాంగాన్ని తయారు చేయడం మొదలు పెట్టే సరికి పరిస్థితి ఇది. జమ్మూ-కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక స్థితిని రాజ్యాంగ కర్తలు స్పష్టంగా గుర్తించారు. వాళ్లంతా 'దేశభక్తులే', పాకిస్తాన్ ఏజెంట్లు కారు. దేశ విచ్ఛిన్నకులు కారు. ఆర్టికల్ 370ని ప్రతిపాదించిన గోపాలస్వామి అయ్యంగార్ జమ్మూ-కాశ్మీర్ విలీనం వెనక వున్న చరిత్రను వివరించి, ఆ చరిత్రను దృష్టిలో ఉంచుకొని ఆ రాష్ట్రం కోసం ప్రత్యేక అధికారాన్ని ప్రతి పాదిస్తున్నా నన్నారు. విలీన ఒడంబడికలో చెప్పిన మేరకు మాత్రమే కేంద్ర ప్రభుత్వానికి కాశ్మీర్ మీద శాసన అధికారం ఉంటుందనీ, ఏదయినా ఒక విషయం ఆ పరిధిలోకి వస్తుందా రాదా అన్న విషయాన్ని భారత ప్రభుత్వం కాశ్మీర్ ప్రభుత్వాన్ని సంప్రదించి నిర్ణయిస్తుందనీ, విలీన ఒడంబడికలో లేని విషయాలలో కూడా కేంద్ర ప్రభుత్వం తనకు శాసనాధికారం కావాలని కోరుకుంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో మాత్రమే పొందగలదనీ ఆర్టికల్ 370 అంటుంది.

ఇందులో మూడవ అంశమే కాశ్మీర్ వ్యక్తిత్వానికి గొడ్డలి పెట్టు అయింది. స్వయం ప్రతిపత్తి ఇస్తున్నామని ఒకవైపు చెప్తూ ఆ స్వయం ప్రతిపత్తిని రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో తొలగించ వచ్చునని కొసరు చేర్చడం వలన స్వయం ప్రతిపత్తి ఏ మాత్రం మిగలలేదు. ప్రజాస్వామికంగా ఎన్నికయిన షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని 1953లో గవర్నర్ కరణ్‌సింగ్ (మాజీ రాజు హరిసింగ్ కొడుకు) 'అసమర్థ పాలన' అనే పేరుపెట్టి బర్తరఫ్ చేసాడు, షేక్ అబ్దుల్లాను అరెస్టు చేసారు. ఈరకంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని లొంగదీసుకొని, 1954లో 'రాష్ట్ర ప్రభుత్వం అనుమతితో' కేంద్ర ప్రభుత్వానికి ఇతర రాష్ట్రాలలో ఉన్న శాసన అధికారాన్ని కాశ్మీర్‌లో కూడ దత్తం చేసే 'రాజ్యాంగం (జమ్మూ-కాశ్మీర్ సంబంధిత) ఆర్డర్' జారీ చేసింది కేంద్ర ప్రభుత్వం. దీనితో ఆర్టికల్ 370 పూర్తిగా నిస్సారమయి పోయింది. 1957లో జమ్మూ-కాశ్మీర్‌కు ఒక ప్రత్యేక రాజ్యాంగాన్ని రాసుకున్నారు గాని అంతిమ పరిశీలనలో జమ్మూ-కాశ్మీరుకు మిగిలిన స్వయం ప్రతిపత్తి ముఖ్యం.

1947లోనే పాకిస్తాన్‌తన ఎత్తుగడ విఫలమయిందని గుర్తించి 'కాశ్మీర్ సమస్య'ను ఐక్యరాజ్య సమితికి నివేదించింది. కాశ్మీర్ భవితవ్యాన్ని కాశ్మీర్ ప్రజలే నిర్ణయించుకోవాలనీ, అందుకోసం ప్లెబిసైట్ (Plebiscite), అంటే సర్వజన అభిప్రాయ సేకరణ నిర్వహించాలనీ ఐక్యరాజ్య సమితి తీర్మానించింది. ఆ రోజులలో నెహ్రూకూడ 'కాశ్మీర్ భవితవ్యాన్ని కాశ్మీర్ ప్రజలే నిర్ణయించుకుంటారు. ఇది మేము కాశ్మీర్ ప్రజలకే కాక యావత్ ప్రపంచానికి ఇస్తూ వున్న వాగ్దానం' అని ప్రకటించాడు. ఆరేళ్ల తరువాత అదే నెహ్రూ షేక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయించి, కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని హుళక్కి చేసే 1954 ఆర్డర్‌ను జారీచేసి, 1957 ఎన్నికల నాటికి 'కాశ్మీర్ భారత భూభాగమేననడంలో ఎటువంటి వివాదానికి తావులేదు' అని ప్రకటించడం మొదలు పెట్టాడు. ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్ కాశ్మీర్ ప్రస్తావన తెచ్చినప్పుడల్లా భారతదేశం సోవియట్ రష్యా యొక్క వీటో అధికారాన్ని అడ్డం పెట్టుకొని బయట పడుతూ వుంది.

కాశ్మీర్‌లో మళ్లీ ప్రజా ప్రభుత్వం ఏర్పడడం అంటూ జరిగితే సమస్య తిరిగి మొదటికొస్తుందని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఒక్క ఎన్నికా కూడ సక్రమంగా జరగనివ్వలేదు. అన్ని ఎన్నికలలోనూ రిగ్గింగ్, హింసాకాండ, పెద్ద ఎత్తున జరుగుతూ వచ్చాయి. ఎప్పుడూ కూడా కేంద్రానికి తొత్తులయిన వాళ్లే




స్వతంత్ర కాశ్మీర్ కోసం నినదిస్తున్న ప్రజ

# విదేశీ హస్తం

(ప్రశాంతమైన కాశ్మీర్ లోయలో వేర్పాటు ఆందోళన మునుపటి కన్నా తీవ్రంగా రగుల్కొంటున్నది. ఎక్కడ చూసినా అమనుల్లాఖాన్ పేరు విపరీతంగా వినబడుతున్నది. అమనుల్లాఖాన్ ప్రముఖ కాశ్మీర్ తీవ్రవాది మఖ్బూల్ భట్‌కు సన్నిహిత మిత్రుడు. మఖ్బూల్‌భట్‌ను తిహార జైల్లో 1984లో ఉరి తీశారు. అమనుల్లాఖాన్ లండన్ కేంద్రంగా గల జమ్మూ కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంటుకు అధ్యక్షుడు. ఈయన లైసెస్టర్ జైలులో ఉండగా ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ సంపాదకుడు ప్రీతిశ్ నంది కి 1985లో ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ లోని ముఖ్య భాగాలను ఈ కింద ఇస్తున్నాం.)

**మీ ఆర్గనైజేషన్ ఎందుకు చీలింది? మీకు బనీగ్రూపుకు మధ్య ఉన్న విభేదాలు ఏమిటి?**

వారు పాకిస్తాన్ అనుకూలురు. మేము కాశ్మీర్ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నప్పుడు ఇండియానుంచి ఎంత దూరంగా ఉండాలను కుంటున్నామో పాకిస్తాన్‌తో కూడా అంతే, స్నేహమైనా అంతే. వారు పాకిస్తాన్‌తో సంబంధం కలిగి ఉన్నారన్నది జగమెరిగిన సత్యం.

**కాని మీరుకూడ ఇండియా పట్ల ఉన్నంత వైరభావంతో పాకిస్తాన్‌తో లేరు.**

ఇది నిజంకాదు. మేము ఇండియాతో గానీ, పాకిస్తాన్‌తో గాని వైరభావంతో లేము. మా దేశాన్ని మేము పాలించుకునేందుకు మమ్మల్ని ఒంటరిగా వదిలేస్తే చాలు. కాశ్మీర్‌కు స్వాతంత్ర్యం కావాలి. మేము కోరుకుంటున్నదీ అదే.

**పాకిస్తాన్ గురించి, మా కోసం జియా ఉల్‌హక్ ఏమి చేశాడు?** ఏమీ లేదు. కాని ఒకటి నిజం. కాశ్మీర అధ్యాయాన్ని ముగిస్తామని మీదేశం బెదిరిస్తున్నట్టు వారు చేయడం లేదు.

**జె.కె.ఎల్.ఎఫ్. ముఖ్య లక్ష్యాలు ఏమిటి?**

విదేశీ ఆధిపత్యం నుంచి కాశ్మీర్‌కు స్వేచ్ఛ కావాలి. పాకిస్తాన్‌కు గానీ, ఇండియాకు గానీ చెందని స్వతంత్ర దేశం ఏర్పడాలి. అది కాశ్మీర్ ప్రజలకు చెంది ఉండాలి.

**దీన్ని ఎలా సాధించాలను కుంటున్నారు?**

మా హక్కుల కోసం పోరాడ్డం ద్వారా. ఇది దీర్ఘకాలిక పోరాటమని. మాకు తెలుసు. ఎవరూ మమ్మల్ని బుజ్జగించి స్వాతంత్ర్యం ఇవ్వరనీ తెలుసు. మేము అడుగడుగున పోరాటం చేయాల్సిందే. కాని మీరు మా పోరాటాన్ని గౌరవించాలి. స్వాతంత్ర్యం కోసం మా పోరాటాన్ని గౌరవించడం ఇండియా నేర్చుకోవాలి.

**పాకిస్తాన్ గూఢచారి వర్గాల ద్వారా మీ ఆర్గనైజేషన్‌కు కావలసినంత సహాయం అందుతున్నదని ఆధారాలు ఉన్నాయి.**

బనీ గ్రూపుకు కావచ్చు. మాకు కాదు.

**మీగ్రూపుకు ఎందుకు కాదు?**

మాలో స్వాతంత్ర్య కాంక్ష ఉంది. మాకు జియా అన్నా మరెవరన్నా లక్ష్యం లేదు. మాకు స్వతంత్ర కాశ్మీర్ కావాలి.

**మీరు హింసను ఖండిస్తారా?**

స్వాతంత్ర్య జాతీయోద్యమం ఏదీ కూడా పూర్తిగా సాయుధపోరాటం, హింసే మార్గమని చెప్పదు. దురాక్రమణ దారుల హింసను ఎదుర్కో టానికి స్వాతంత్ర్య యోధుడు హింసకు తలపడతాడు.

**సిక్కు తీవ్రవాదుల గురించి ఏమంటారు?**

వాళ్ళు మా స్నేహితులు. స్వంత దేశం కోసం వారి పోరాటాన్ని మేము బలపరుస్తాం. కాశ్మీర్ లాగే ఖలిస్తాన్ కూడా ఒక రోజు స్వతంత్రం అవుతుంది. ఏ దేశం కూడా ఎల్లకాలం బానిసత్వంలో మగ్గిపోదు. దీన్ని భారత ప్రభుత్వం తప్పక తెలుసుకుంటుంది. పోరాటంలో మేము, సిక్కులు ఒకటిగా ఉన్నాం.

**మీ చర్యల పర్యవసానం పట్ల మీకు చింతలేదా?**

మేమెందుకు చింతించాలి. భారత ప్రభుత్వమే చింతించాలి.

(ఇల్లస్ట్రేటెడ్ వీక్లీ సౌజన్యంతో)

గెలుస్తూ వచ్చారు. 1975లో ఇందిరా గాంధీకి షేక్ అబ్దుల్లాకు జరిగిన ఒడంబడికలో కాశ్మీర్ సమస్య పరిష్కారం అయిపోయిందని అబ్దుల్లా ఒప్పుకున్న తరువాతనే అతని రాజకీయ స్వేచ్ఛ పునరుద్ధరించ బడింది. ఆ తరువాత అతను తిరిగి అధికారంలోకి రాగలిగాడు. అతని మరణానంతరం 1983లో అతని కుమారుడు ఫరూక్ అబ్దుల్లా ఎన్నికయ్యాడు. అయితే ఇతను మళ్లీ ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలసి రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని గురించి మాట్లాడడం ప్రారంభించే సరికి 1984లోనే ఇతని ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేసారు. తిరిగి ఫరూక్ అబ్దుల్లా కాంగ్రెస్‌కు తొత్తుగా మారడానికి ఒప్పుకొని రాజీవ్ గాంధీతో 1986లో ఒప్పందం చేసుకున్న తరువాతే అధికారానికి రాగలిగాడు. దాని వల్ల అతను పొందిన ప్రతిఫలం ఏమిటంటే, విపరీతమయిన స్థాయిలో అవినీతికి బాహాటంగా పాల్పడడం ప్రారంభించినా కేంద్రం జోక్యం చేసుకోకుండా కొనసాగ నిచ్చింది.

ఇదీ క్లుప్తంగా 'కాశ్మీర్ సమస్య' చరిత్ర. కాశ్మీర్ ప్రజల జాతీయ వ్యక్తిత్వాన్ని అగౌరవపరచి, వాళ్లకు కల్పిస్తామని హామీ యిచ్చిన స్వయం ప్రతిపత్తినే స్వయం నిర్ణయాధికారాన్ని లేకుండా చేసి, కనీసం పార్లమెంటరీ ప్రజాస్వామ్య సంప్రదాయాలను విలువలనూ పాటించకుండ కేంద్రానికి కాంగ్రెస్ పార్టీకి తొత్తులయిన వారికి మట్టుకే కాశ్మీర్‌లో అధికారానికి వచ్చే అవకాశం వుందని పదే పదే స్పష్టంచేసి, అందుకోసం ప్రభుత్వాలను బర్తరఫ్ చేసి, హింసకు పాల్పడి - ఇన్ని చేసిన తరువాత కాశ్మీర్ ప్రజలకు భారత దేశం మీద ఇంకా ప్రేమ మిగిలివుంటే మనం ఆశ్చర్యపోవాలి గానీ ద్వేషం పెరిగితే ఆశ్చర్యపోవలసిన అవసంర ఏముంది? అసలు బారతదేశంలో అంతర్భాగంగా ఉండడంవల్ల జమ్మూ-కాశ్మీర్ ఏం సాధించింది, ఏ ప్రయోజనం పొందింది? కనీస పారిశ్రామిక ప్రగతి గానీ ఆర్థిక అభివృద్ధి గానీ ఈ నాలుగు దశాబ్దాలలో కాష్మీర్‌కు దక్కాయా? ఏ ప్రయోజనమూ పొందనప్పుడు వాళ్ళు ఈదేశంతో విలీనం కావాలని ఎందుకు కోరుకోవాలి? నాలుగు దశాబ్దాల దగా కోరు పాలన ఫలితంగా ఇవ్వాళ కాశ్మీర్ ప్రజలు నూటికి నూరుశాతం తమకు భారత దేశంలో అంతర్భాగంగా ఉండాలనీ లేదనీ స్వాతంత్ర్యం కావాలనీ కోరుకుంటూ వుంటే, సైన్యం మోహరింపులకూ, పోలీసుల కాల్పులకూ బెదరకుండ భయపడకుండ వేల సంఖ్యలో ఊరేగింపులు చేస్తూవుంటే ఇదంతా దేశద్రోహుల నిర్వాకమని పాకిస్తాన్ సాగిస్తున్న దుర్మార్గమనీ ఎన్నాళ్ళు ఆత్మ వంచన చేసుకుంటాం? 'దేశభక్తిని' 'దేశ సమగ్రత'నూ తుపాకులతో నిల బెట్టాలనే అర్థరహితమయిన ప్రయత్నాన్ని ఎన్నాళ్ళు సహిస్తాం?

కె. బాలగోపాల్